

ఎఫ్ఆర్వో ఉద్యోగాలకు నేడు రాత పరీక్ష

విజయనగరం కలెక్టరేట్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ఆదివారం జరగనున్న ఫారెస్టు రేంజ్ ఆధికారి (ఎఫ్ఆర్వో) పరీక్ష పక్కాగా నిర్వహించాలని డీఆర్వో శ్రీనివాసమూర్తి ఆదేశించారు. తన చాంబర్‌లో శనివారం సాయంత్రం సమీక్షా నిర్వహించారు. ఉదయం 9.30 నుంచి 12 వరకూ, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకూ ఎంజీవిఆర్, అయాన్ డిజిటిల్ జోన్‌లో పరీక్షలు జరుగుతాయన్నారు. అభ్యర్థులకు ఇబ్బంది లేకుండా పరీక్షలు నిర్వహించాలని, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతిలేదన్నారు. సమీక్ష సమావేశంలో పరీక్షల విభాగం సూపరింటెండెంట్ భాస్కరరావు ఉన్నారు.



హమ్మయ్యా..

- పరీక్షల చివరి రోజు ఆనందంగా కనిపించిన ఇంటర్ విద్యార్థులు

విజయనగరం కలెక్టరేట్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పగలనక రేయినక పుస్తకాలతో కుస్తీలు పట్టి.. టెన్షన్ టెన్షన్‌గా పరీక్షలకు బయలుదేరి.. ఏ జవాబుకు ఎన్ని మార్కులు వస్తాయో బేరీజు వేసుకుని.. ఈ హడావిడిలో అంతంతమాత్రంగా నిద్రాహారాలతో గడిపిన క్షణాల నుంచి వారికి స్వేచ్ఛ లభించినట్లయింది. హమ్మయ్యా అనుకున్నారు. ఇంటర్ పరీక్షల చివరి రోజు విద్యార్థులంతా కేరింతలు కొట్టారు. ద్వితీయ సంవత్సర పరీక్షలు రాసిన వారంతా పరీక్ష సెంటర్ నుంచి బయటకు వస్తూనే ఆనందంగా కనిపించారు. స్నేహితులందరినీ కలుసుకుని కాసేపు మాట్లాడుకున్నారు. ఇంటికి వెళ్లే ముందు గ్రూపు ఫొటోలు, సెల్ఫీలు తీసుకోవడం కనిపించింది. కాగా ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారంతో ముగిశాయి. రెండో సంవత్సరం విద్యార్థులకు సంబంధించి చివరి రోజు కెమిస్ట్రీ, కామర్స్ సబ్జెక్టుల పరీక్షలు జరిగాయి. శనివారం 17383 విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 16,922 మంది రాశారు. 461 మంది దూరంగా ఉన్నారు. ఈనెల ఒకటో తేదీన పరీక్షలు ప్రారంభమైన సంగతి తెలిసిందే. ప్రతి రోజు ఉదయం 9 నుంచి 12 గంటల వరకూ పరీక్ష జరిగింది. జిల్లా వ్యాప్తంగా 66 కేంద్రాల్లో నిర్వహించారు. కేంద్రాలను ఆర్ఐవో, డెక్ మెంబర్లు తనిఖీ చేశారు.



విజయనగరం: పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు


చాన్స్ ఎవరికో?

- నెలాఖరుకు వందలాది పదవులు భర్తీ చేసే అవకాశం
- ఏఎంసీలు, పీఏసీఎస్, ఆలయ ట్రస్ట్‌బోర్డులపై ప్రభుత్వం దృష్టి
- జాబితాలు ఆమోదం.. జిల్లాకు ప్రాధాన్యం ఇచ్చే అవకాశం



విజయనగరం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో కూటమి క్లీన్‌స్వీప్ చేసింది. అన్ని నియోజకవర్గాల్లోనూ కొలువుదీరింది. జిల్లా ప్రజలు అద్వితీయ విజయాన్ని అందించారు. ఇందుకు కృతజ్ఞతగా ప్రభుత్వం కూడా జిల్లాకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోంది. గజపతినగరం నుంచి తొలిసారిగా గెలిచిన కొండపల్లి శ్రీనివాస్‌కు మంత్రి పదవి ఇచ్చింది. యువతను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో సీఎం చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారు. అలాగే నామినేటెడ్ పదవుల్లో జిల్లాకు చెందిన నలుగురికి రాష్ట్రస్థాయి పదవులు కట్టబెట్టారు. తాజాగా కావలి గ్రీష్మకు ఎమ్మెల్సీగా అవకాశమిచ్చారు. ఈ నెలాఖరుకు జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, 11 వరకూ ఉన్న మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను నియమించే అవకాశం ఉంది. ఆలయ ట్రస్ట్ బోర్డులు, ఆస్పత్రుల కమిటీలకు సైతం ఛైర్మన్‌తో పాటు డైరెక్టర్లను నియమించనున్నారు. ఈ మేరకు ఆశావహుల జాబితాలు హైకమాండ్‌కు వెళ్లాయి. స్థానిక ఎమ్మెల్యేల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకొని ఒక నిర్ణయానికి రానున్నారు. ఇప్పటికే సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ దీనిపై పార్టీ శ్రేణులకు స్పష్టమైన సంకేతాలు పంపినట్లు తెలిసింది. నెలాఖరుకు పదవుల భర్తీ ఉంటుందని చెప్పారంటున్నారు. స్థానికంగా ఉన్న బలాబలాలు, ప్రత్యేక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని జనసేన, బీజేపీ నేతలకు సైతం పదవులు కేటాయించనున్నారు.



తొలి జాబితాలో కర్రోతు..

ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొలి నామినేటెడ్ జాబితాలో కర్రోతు బంగార్రాజుకు చాన్స్ దక్కింది. ఆయనకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ ఛైర్మన్‌గా అవకాశమిచ్చారు. భోగాపురం నియోజకవర్గంలో గత ఐదేళ్లు పార్టీ అభివృద్ధికి ఆయన కృషిచేశారు. 2024 ఎన్నికల్లో పోటీకి సైతం సిద్ధపడ్డారు. కానీ పొత్తుధర్మంలో భాగంగా ఈ సీటు జనసేనకు కేటాయించాల్సి వచ్చింది. దీంతో బంగార్రాజు మనస్తాపానికి గురయ్యారు. కూటమి అధికారంలోకి వస్తే సముచిత స్థానం కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అందుకు తగ్గట్టుగానే రాష్ట్రస్థాయి కార్పొరేషన్ ఛైర్మన్‌గా అవకాశమిచ్చారు. నామినేటెడ్ రెండో జాబితాలో మాజీ మంత్రి సుజయ్ కృష్ణ రంగారావుకు ఏపీ ఫారెస్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా అవకాశమిచ్చారు. అలాగే ఏపీ ఉమెన్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్‌గా కావలి గ్రీష్మకు చాన్స్ ఇచ్చారు. జనసేనకు సంబంధించి పాలవలస యశస్వినికి తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్‌పర్సన్‌గా నియమించారు. అటు మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడుకు బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్‌గా నియమించారు. ఇక డైరెక్టర్లుగా పదుల సంఖ్యలో జిల్లా వారికి అవకాశమిచ్చారు.

ఎమ్మెల్సీగా గ్రీష్మ..

తాజాగా ఎమ్మెల్సీగా కావలి గ్రీష్మకు అవకాశమిచ్చారు. ఈమె గత ఐదేళ్లు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడంతో పాటు అప్పటి అధికార పక్షానికి దీటుగా నిలబడ్డారు. సీబీఎన్ బాధ్యతలు చూశారు. ఈమె తల్లి కావలి ప్రతిభాభారతి టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కీలక బాధ్యతలు చూస్తూ రావడంతో పాటు ఉమ్మడి రాష్ట్రానికి స్పీకర్‌గా పనిచేశారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గంలో 1983 నుంచి 1999 వరకూ వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. ప్రతిభాభారతి వారసురాలిగా టీడీపీలో చేరినప్పటి నుంచి యాక్టివ్‌గా పనిచేస్తున్న (మిగతా 8వ పేజీలో..)



విరామం.. ఊరటే

- రోజు విడిచి రోజు పది పరీక్షల నిర్వహణ
- ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం
- హాజరుకానున్న విద్యార్థులు 23,765 మంది

రాజాం రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): టెన్త్ పరీక్షల ప్రశ్నాపత్రం, నిర్వహణలో ప్రభుత్వం మార్పులు తీసుకువచ్చిన విషయం తెలిసిందే. గతానికి భిన్నంగా రోజు విడచి రోజు పరీక్షలు నిర్వహించేలా టైంటేబుల్‌ను రూపొందించారు. దీంతో విద్యార్థు లకు ఊరట కలగనుంది. తర్వాత పరీక్షకు సన్నద్ధం అయ్యేందుకు దోహదపడనుంది. విద్యార్థుల్లో ఒత్తిడి దూరం కానుంది. పరీక్షల తేదీ దగ్గర పడుతున్నకొద్దీ విద్యార్థుల్లో ఒత్తిడి పెరగడం సహజం. పదో తరగతి విద్యార్థుల్లో ఇది మరింత ఎక్కువగా ఉంటుంది. పగలు, రాత్రి కష్టపడి చదివినదంతా గుర్తుపెట్టుకుని పరీక్షరోజు బాగా రాయాలని, పదికి పది గ్రేడ్ సాధించాలనే ఆలోచనతో ఉంటారు. ఈ క్రమంలో కొన్ని అంశాలను మరిచిపోయి తక్కువ గ్రేడ్‌తో సరిపెట్టుకున్న సందర్భాలు లేకపోలేదు. విద్యావ్యవస్థను ప్రక్షాళన చేయడానికి సిద్ధమైన కూటమి ప్రభుత్వం పదోతరగతి విద్యార్థుల అంతర్మథనాన్ని గుర్తించింది. భిన్నంగా టైంటేబుల్‌ను విడుదల చేసింది. ప్రతి పరీక్షకు మధ్యలో ఒకరోజు సెలవు ఉండేలా షెడ్యూల్‌ను ప్రకటించింది. జిల్లాలో ఈ ఏడాది 119 పరీక్ష కేంద్రాల్లో 23,765 మంది పదోతరగతి విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.

గతంలో..

గతంలో పరీక్షలు జరిగే రోజుల్లో ఆదివారం, ప్రభుత్వ సెలవు దినాలు మినహా ప్రతిరోజూ పరీక్ష నిర్వహించే వారు. ఈ విధానం వల్ల విద్యార్థులు తీవ్ర ఒత్తిడి కి గురయ్యేవారు. పరీక్ష పూర్తయ్యాక మండుటెండల్లో ఇల్లు చేరేసరికి కనీసం మూడు నాలుగు గంటలు సమయం పట్టేది. దీంతో మరుసటి రోజు పరీక్షకు ప్రిపేర్ అయ్యేందుకు అవస్థలు పడాల్సి వచ్చేది.

ఉచిత ప్రయాణం

పదోతరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రయాణ పాట్లును తప్పించే లక్ష్యంతో పరీక్ష కేంద్రం వరకూ రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సుల్లో ప్రభుత్వం ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. జిల్లాలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు చెందిన వందలాది మంది విద్యార్థులు ఏటా పదో తరగతి (మిగతా 8వ పేజీలో..)

6 కొత్తదారిలో ఇంటర్
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి మార్పులు
- ఏప్రిల్ 1 నుంచి ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు
- 24 నుంచి జూన్ 1 వరకు సెలవులు
- జేఈఈ, ఎంసెట్‌కు శిక్షణపైనా దృష్టి



6 తెలుగు సినిమాలకే ప్రాధాన్యం
- 'లక్కీభాస్కర్'లో సుమతి పాత్ర చాలా ఇష్టం
- త్వరలో నాగచైతన్యతో సినిమా
- సినీ నటి మీనాక్షి చౌదరి

లివిరిలో రంగుల సందడి
- వైభవంగా డోలోత్సవాలు
- వంశధార నదిలో చక్రతీర్థ స్నానం
6

పీ-4 సర్వేపై అపోహలొద్దు

పేదల అవసరాల గుర్తింపునకే: మంత్రి శ్రీనివాస్



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

విజయనగరం కలెక్టరేట్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేదల అవసరాలను గుర్తించడానికే పబ్లిక్, ప్రైవేటు, పీపుల్ పార్టిసిపేషన్ (పి-4) సర్వే చేపట్టిందని, సంక్షేమం ఆగిపోతుందేమోనన్న అపోహలు వద్దని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో పి-4 సర్వే, స్వర్ణ ఆంధ్ర-2047లో భాగంగా నియోజకవర్గం అభివృద్ధికి విజన్ ప్లాన్ తయారీపై శనివారం జిల్లా ప్రత్యేకాధికారి డాక్టరు ఏ.బాబు ఆధ్వర్యంలో అధికారులతో సమీక్షించారు. మంత్రి మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో 78 శాతం సర్వే పూర్తయిందని, మిగిలిన సర్వే రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. విజన్ ప్లాన్ తయారీలో భాగంగా గజపతినగరం నియోజకవర్గానికి సంబంధించి సీపీవో బాలాజీ పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ఇచ్చారు. మంత్రి మాట్లాడుతూ గజపతినగరం నియోజకవర్గంలో ఆయిల్‌పామ్ పంట అధికంగా ఉందని, దీనికి సంబంధించిన పరిశ్రమ పెట్టడానికి అనేక మంది సిద్ధంగా ఉన్నారని, జిల్లాలో ఆయిల్‌పామ్‌పై సమగ్ర ప్రణాళిక తయారు చేయాలన్నారు. మామిడి కూడా అధికంగా సాగవుతోందన్నారు. ప్రతి మండల కేంద్రంలో ఒక బిజినెస్ సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి రెండు ఎకరాలు గుర్తించాలని, ప్రతి శాఖ ఎంఎస్ఎంఈ అభివృద్ధికి (మిగతా 8వ పేజీలో..)

కొండపైకి టీకా చేరేనా?

- దృష్టి సారించని వైద్యులు, సిబ్బంది
- రోడ్లు బాగాలేవని వెనకడుగు
- మీడియాలో వార్తలొచ్చాక హడావిడి
- అయోమయంలో కొండశిఖర గిరిజనులు



కుమార్తెను భుజంపై కూర్చోబెట్టి ఆస్పత్రికి తరలిస్తున్న గిరిజనుడు

శృంగవరపుకోట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): భుజంపై చిన్నారిని ఎత్తుకొని నడుచుకుంటూ వస్తున్న ఆ గిరిజనుడు శృంగవరపుకోట మండలం దారపర్తి గిరిశిఖర పంచాయతీ వాసి. ఇరవై కిలోమీటర్ల దూరంలో వున్న ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి గత నెల 25న నడుచుకుంటూనే వెళ్లాడు. ఇదే పంచాయతీ పరిధిలోని మరికొన్ని గ్రామాల్లోనూ పిల్లలు జ్వరాల బారిన పడిన వైనంపై 'ఆంధ్రజ్యోతి'లో వార్త రావడంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కళ్లు తెరిచింది. తట్టువ్యాధిగా భావించి పది నెలల నుంచి ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు మీజిల్స్ రూబెల్లా (ఎంఆర్)టీకాలను ఇచ్చింది. ఈ టీకాను ఆ పిల్లలకు సకాలంలో వేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. రోడ్డు సదుపాయం లేదు కొండెక్కి వెళ్లలేమని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు... అంత దూరం నడుచుకుని కొండ దిగి రాలేమని గిరిజన తల్లులు భావించడంతో చాలా మంది పిల్లలకు టీకాలు దక్కలేదు. దీంతో ఆ పిల్లలకు వ్యాధుల నుంచి రక్షణ కరువైంది. ఇప్పుడు తట్టు రూపంలో పంజా విసురుతోంది.

వ్యాధుల బారి నుంచి ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన వైద్య ఆరోగ్య శాఖ సకాలంలో టీకాలను వేయకపోవడంతో ఓ పక్క పిల్లలు శరీరకంగాను, మరో పక్క కుటుంబ సభ్యులు మానసికంగా ఇబ్బంది పడుతున్నారు. వాస్తవానికి మాతా, శిశు సంరక్షణకు ప్రభుత్వం రూ.కోట్లలో ఖర్చు పెడుతోంది. వారిలో వ్యాధి నిరోధక శక్తిని పెంచేందుకు జాతీయ స్థాయిలో టీకాలు వేస్తున్నారు. ఇంత ప్రాధాన్యత కలిగిన టీకా (వ్యాక్సినేషన్) కార్యక్రమాన్ని రహదారి సదుపాయం లేదన్న సాకుతో గిరి శిఖర గ్రామాల్లో ఇవ్వడం మానేయడం విస్మయం కలిగిస్తోంది. వారం, రెండు వారాలైతే ఫర్వాలేదు. ఏళ్లకు ఏళ్లు టీకాలు ఇవ్వకపోయినా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు దృష్టిసారించకపోవడం నిర్లక్ష్యానికి నిలువుటద్దం. ప్రతి బుధ, శనివారాల్లో వైద్య ఆరోగ్యశాఖ టీకాల కార్యక్రమం చేపడుతుంది. నిర్దిష్ట ఉష్ణోగ్రతతో కలిగిన బాక్స్‌లో చిన్నారులకు అవసరమైన టీకాలను భద్రపరిచి సమీప (మిగతా 8వ పేజీలో..)



అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు

- రూ.14 కోట్ల కేటాయింపు
- ఐసీడీఎస్ ఆర్‌జేడీ చిన్మయిదేవి

రామభద్రపురం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.14 కోట్లు వెచ్చిస్తోందని ఐసీడీఎస్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ చిన్మయిదేవి తెలిపారు. మండల కేంద్రంలో ఉన్న అంగన్‌వాడీ పాల సరఫరా కేంద్రాన్ని శనివారం ఆమె తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఉన్న 13 వేల 819 అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ ఈ ఏడాది పూర్తిస్థాయిలో మౌలిక సౌకర్యాలు (మిగతా 8వ పేజీలో..)



స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ చిన్మయిదేవి

కొత్త దారిలో.. ఇంటర్



- వచ్చే విద్యా సంవత్సరం నుంచి మార్పులు
- ఏప్రిల్ 1 నుంచి ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు
- 24 నుంచి జూన్ 1 వరకు సెలవులు
- జేఈఈ, ఎంసెట్‌కు శిక్షణపైనా దృష్టి

విజయనగరం కలెక్టరేట్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ విద్య కొత్త బాట పట్టనుంది. ఇకపై రెగ్యులర్ తరగతులతో పాటు ఎంసెట్, జేఈఈకి విద్యార్థులను సిద్ధం చేయనున్నారు. వచ్చే విద్యా సంవత్సరం (2025-26) నుంచి ఇంటర్ విద్యలో మార్పులు, చేర్పులకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. ఇప్పటి వరకూ ఇంటర్ వార్షిక పరీక్షలు ముగిసిన తర్వాత ప్రభుత్వ కళాశాలలకు సెలవులు ఇస్తున్నారు. జూన్ ఒకటో తేదీ నుంచి కొత్త విద్యా సంవత్సరాన్ని ప్రారంభిస్తున్నారు. సెలవుల్లో ప్రైవేటు కళాశాలలు మాత్రం ప్రవేశాలు, తరగతులు నిర్వహిస్తుండేవి. దీంతో ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు తగ్గిపోతున్నాయి. ప్రైవేటు విద్యార్థులతో పోల్చితే ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు చదువులో వెనుకబడుతున్నారు. దీనిని అధిగమించడానికి ఈసారి ఏప్రిల్ ఒకటో తేదీ నుంచే ద్వితీయ సంవత్సరం తరగతులు ప్రారంభించనున్నారు. మార్చి 17 నుంచి 31 వరకు పదో తరగతి పరీక్షలు ఉన్నందున వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఈ తరగతులు మొదలు పెట్టనున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా...

విజయనగరం జిల్లాలో 21,960 మంది, పార్వతీపురం మన్యం జిల్లాలో 8 వేల మంది విద్యార్థులు ఇంటర్ చదువుతున్నారు. వచ్చే నెల నుంచే ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ మొదలుపెట్టడం వల్ల విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని అధ్యాపకులు అంచనా వేస్తున్నారు. ఈ ప్రవేశాల అనంతరం టెన్త్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను కొనసాగించి.. ఫెయిలైన వారిని తొలగిస్తారు.

ఇకపై ఎలాగంటే...

ఏప్రిల్ 7 నుంచి ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు కల్పించనున్నారు. పదో తరగతి పరీక్ష రాసిన ప్రతి విద్యార్థి ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ తీసుకోవచ్చు. ఏప్రిల్ 23 వరకు తరగతులు, ప్రవేశాలు నిర్వహిస్తారు. అదే నెల 24 నుంచి జూన్ 1 వరకు సెలవులు ప్రకటించారు. మళ్లీ జూన్ 2 నుంచి యథావిధిగా తరగతులు ప్రారంభమవుతాయి. దీని వల్ల ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు మెరుగుపడే అవకాశం ఉందంటున్నారు. ఏప్రిల్ 1 నుంచి 23 వరకు నిర్వహించే తరగతుల్లో 15శాతం సిలబస్ పూర్తి చేస్తారు. మొత్తం సిలబస్‌ను కూడా డిసెంబరు 31వ తేదీ కంటే ముందే పూర్తి చేసి రివిజన్ ప్రారంభిస్తారు. అదే విధంగా ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న సైన్స్ గ్రూపు విద్యార్థులకు జేఈఈ, ఎంసెట్‌లకు శిక్షణ ఇవ్వాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అకడమిక్ తరగతులు నిర్వహించి... 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జేఈఈ, ఎంసెట్‌లకు సంబంధించిన శిక్షణ ఇస్తారు.

చక్కగా ఉపయోగపడుతుంది..

ఏప్రిల్ నుంచి రెండో సంవత్సరం విద్యార్థులకు తరగతులు నిర్వహించడం చాలా ఉపయోగ పడుతుంది. ప్రైవేటు కళాశాలల విద్యార్థులతో పోటీ పడి చదవవచ్చు. వేసవి సెలవుల్లో బయట తిరగకుండా కాలేజీలో చదువుకుంటారు. ఈ సమయంలో 15 నుంచి 20 శాతం సిలబస్ పూర్తి చేయవచ్చు. సెలవుల అనంతరం మిగిలిన సిలబస్ పూర్తి చేయవచ్చు. విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

-జగన్నాథరావు, ప్రిన్సిపాల్, గంట్యాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల

అన్ని కళాశాలల్లో తరగతులు నిర్వహిస్తాం..

జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో ఏప్రిల్ మొదటి నుంచి తరగతులు ప్రారంభించనున్నాం. జిల్లాలోని 21,900 మంది విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తాం. మొదటి సంవత్సరం విద్యార్థులకు బ్రిడ్జి కోర్సు బోధిస్తారు. రెండో సంవత్సరం విద్యార్థులకు అకడమిక్ పాఠ్యాంశాలు బోధిస్తారు.

-మజ్జి ఆదినారాయణ, ఆర్‌ఐవో, విజయనగరం

తెలుగు సినిమాలకే ప్రాధాన్యం

- 'లక్కీభాస్కర్'లో సుమతి పాత్ర చాలా ఇష్టం
- త్వరలో నాగచైతన్యతో సినిమా
- సినీ నటి మీనాక్షి చౌదరి



రాజాం రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఎన్ని భాషల్లో అవకాశాలు వచ్చినా తెలుగు సినిమాలకే తొలి ప్రాధాన్యం ఇస్తానని సినీ నటి, 'సంక్రాంతికి వస్తున్నాం' ఫేం.. మీనాక్షి చౌదరి స్పష్టం చేశారు. తాను నటించిన సినిమాలన్నింటిలో 'లక్కీ భాస్కర్' ఎంతో గుర్తింపు తెచ్చిందన్నారు. ఆ చిత్రంలో సుమతి పాత్ర తనకెంతో ఇష్టమని, జీవితాంతం గుర్తుండిపోయే పాత్ర అని మీనాక్షి వెల్లడించారు. ఓ ప్రయివేటు కార్యక్రమంలో పాల్గొనడానికి శనివారం ఆమె రాజాం వచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో తన సినీ జీవితానికి సంబంధించిన వివిధ అంశాలను పంచుకున్నారు. 'సంక్రాంతికి వస్తున్నాం' సూపర్ డూపర్ హిట్ కావడంతో పాటు తనకూ ఎంతో గుర్తింపును తెచ్చిందన్నారు. ఫలితంగా రెండు తెలుగు రాష్ట్రాలలో తనకు ఫాలోయింగ్ పెరిగిందన్నారు. ప్రస్తుతం నవీన్ పోలిశెట్టి సినిమాలో నటిస్తున్నానని, త్వరలో నాగచైతన్యతో సినిమా చేయబోతున్నట్టు మీనాక్షి ప్రకటించారు. నాగచైతన్యతో కలిసి నటించే అవకాశం రావడంతో ఎగ్జయిటింగ్‌గా ఉందన్నారు. ఇది తన అదృష్టంగా భావిస్తున్నట్టు మీనాక్షి పేర్కొన్నారు. సినిమా అవకాశాలతో పాటు స్క్రిప్ట్ ఎంచుకునే వెసులుబాటు కలుగుతోందన్నారు. సినీ పరిశ్రమలో తన విజయం వెనుక కీలక పాత్ర తెలుగు ప్రేక్షకులదేనని మీనాక్షి చౌదరి స్పష్టం చేశారు.

లివిరిలో రంగుల సందడి


- వైభవంగా డోలోత్సవాలు
- వంశధార నదిలో చక్రతీర్థ స్నానాలు



ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

భామిని, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లివిరిలో గోపీనాథ, రాధాకృష్ణుల డోలోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆంధ్ర, ఒడిశా సరిహద్దులో ఉన్న లివిరిలోని రాధాకృష్ణ దేవాలయం పర్లాకిమిడి గజపతిరాజుల కాలం నుంచి ప్రత్యేకత సంతరించుకుంది. ఇప్పటికీ వారి వారసులు డోలోత్సవంలో పాల్గొంటున్నారు. ఉత్సవాలలో భాగంగా శనివారం రాధాకృష్ణ ఉత్సవమూర్తులను మేళతాళాలతో పెద్ద ఎత్తున ఊరేగించారు. ఈ సందర్భంగా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. తొలుత తిరువీధులు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు పవిత్ర వంశధార నదిలో చక్రతీర్థ స్నానాలు చేయించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణులను భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. పర్లాకిమిడికి చెందిన గజపతుల వారసురాలు కల్యాణి గజపతి.. స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవాలలో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలతో పాటు సరిహద్దులోని ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి, గుణుపూర్, కాశీనగర్, బొత్తవ, బుదర, కిత్తింగి తదితర గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి చక్ర తీర్థ స్నా నాల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులు రాధా పాద దర్శనం చేసుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేశారు.

చక్రతీర్థ స్నానాల్లో పాల్గొన్న భక్తులు



కార్యాలయాల్లో పరిశుభ్రత అవసరం

- ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి/రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అధికారులు, సిబ్బంది ప్రయత్నించాలని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. స్థానిక సీహెచ్‌సీ వద్ద శనివారం 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బేబీనాయన మాట్లాడుతూ ప్రజలు రాకపోకలు సాగించే ప్రాంతాల్లో అడ్డంకులు లేకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, తహసీల్దార్ ఎం.శ్రీను, ఆసుపత్రి సూపరింటెండెంట్ జి. శశిభూషణరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. బొబ్బిలి మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన రీ యూజ్ ప్లాస్టిక్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తొలుత కమిషనర్ లాలం రామలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ర్యాలీని ఎమ్మెల్యే బేబీనాయన ప్రారంభించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను అందంగా తయారు చేసి వాటిలో మొక్కలు నాటి... వాటిని ప్రదర్శనకు పెట్టారు. ఇటీవల వాడి పారేసిన భారీ వాహనాల టైర్లకు ఆకర్షణీయంగా రంగులు వేసి మొక్కలు పెంచారు. ఎమ్మెల్యే బేబీనాయన, ఆర్డీఓ జేవీఎస్ఎస్ రామ్మోహనరావు, తహసీల్దారు మలపురెడ్డి శ్రీను, వైస్‌చైర్మన్ చెలికాని మురళీకృష్ణ, పట్టణ టీడీపీ అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు, తెలుగు మహిళ అధ్యక్షురాలు కింతలి శ్రీదేవి, వెలగాడ హైమావతి తదితరులు వాటిని తిలకించి కమిషనర్‌ను అభినందించారు.



ప్రదర్శనలను తిలకిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన



పార్వతీపురం టౌన్: ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

భావితరాల ఆరోగ్యమే మన లక్ష్యం

- ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం టౌన్/పార్వతీపురం రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): భావితరాల ఆరోగ్యం కాపాడడమే మన లక్ష్యమని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ ప్రధాన మార్కెట్‌లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ నిషేధంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాల్సిన బాధ్యత మహిళా సంఘాలకు ఉందన్నారు. ప్రధాన కాయగూరల మార్కెట్‌లో గుడ్డ సంచులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం బాలకొండ గ్రామంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలోనూ ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ శ్యాంప్రసాద్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి, స్పెషల్ ఆఫీసర్ నారాయణ భరత్ గుప్తా, డీఆర్‌ఓ హేమలత, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య సమస్యలు పరిష్కరించండి

- ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

రాజాం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణాలు, పల్లెల్లో ఎక్కడా పారిశుధ్య సమస్య లేకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం రాజాం బస్ స్టాండ్ ఆవరణలో మున్సిపల్ కార్మికులతో కలిసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఆరోగ్యవంతమైన పరిసరాలు ఏర్పాటు చేసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించుకోవాలన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.



పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

ఘనంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం

రేగిడి, మార్చి 15, (ఆంధ్రజ్యోతి): లక్ష్మీపురంలో వెలిసిన సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రథమ వార్షికోత్సవా లను మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తొలిరోజు స్వామి వారి కల్యాణాన్ని నిర్వ హించారు. అనంతరం సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆచరించారు. ఖండ్యాంకు చెందిన అంపోలు రుద్రకోటేశ్వర శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. తొలి రోజు పుణ్యాహ వచనం, అఖండ దీపారాధన, నవగ్రహ పూజ, హోమాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చంద్రబాబు దంపతులు, బీఆర్ నాయుడు





శ్రీవారికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న సీఎం చంద్రబాబు దంపతులు



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

అమరావతిలో.. శ్రీవారి కల్యాణోత్సవం

రాజధాని అమరావతి వెంకటపాలెంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రప్రథమంగా శనివారం శ్రీవారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణల మధ్య అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడి కల్యాణాన్ని తిలకించిన భక్తజన సందోహం పరవశించింది. విద్యుత్ వెలుగులతో కల్యాణ ప్రాంగణం కాంతులీనగా భక్తుల జయజయధ్వానాల మధ్య కన్నుల పండువగా జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు, గవర్నర్ అబ్దుల్ నజీర్ తదితరుల సమక్షంలో టీటీడీ వేద పండితులు స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులను భాగస్వాములను చేస్తూ కైంకర్యాలను నిర్వహించారు.

-తుళ్లూరు, ఆంధ్రజ్యోతి



చంద్రబాబుకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న బీఆర్ నాయుడు



వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్‌నజీర్, సీఎం చంద్రబాబు దంపతులు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తదితరులు



సీఎం చంద్రబాబుకు వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్



విజయనగరం: అధికారులతో చర్చిస్తున్న మంత్రి కొండపల్లి

విజయనగరం (ఆంధ్రజ్యోతి),మార్చి 15 : జిల్లాలో చేపల పెంపకం ద్వారా ఉపాధి పొందేలా వెలుగు 2.0 ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విజయనగరంలోని మహిళా ప్రాంగణంలో జిల్లా సమాఖ్య, సెర్ప్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన సర్క్యులేటరీ ఆక్వా కల్చర్ విధానాన్ని పరిశీలించారు. ప్లాంట్ పనితీరు, చేపలు పెంచే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కళ్యాణచక్రవర్తి, ఏపీడీ సావిత్రి, నాబార్డు డీడీఎం నాగార్జున, ఉదయ్ ఆక్వా సీఈఓ ఉదయ్, డీపీఎంలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రి పనులు పూర్తిచేయండి

గజపతినగరం, మార్చి15 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. శనివారం గజపతినగరం టీడీపీ కార్యాలయంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన వారి వద్ద నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రిని పరిశీలించారు. వంద పడకల ఆసు పత్రికి సంబందించి పనుల నిర్వహణపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మేనెల నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అన్నక్యాంటీన్ ఏర్పాటుకు స్థలసేకరణ చేపట్టి నివేదిక అందజేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ జగదీష్, ఎంపీడీవో బి.కళ్యాణి, డీటీ శోభ, టీడీపీ నాయకులు గోపాలరాజు, గంట్యాడశ్రీదేవి, మక్కువ శ్రీధర్ పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి చదువే కీలకం

గంట్యాడ, మార్చి 15(ఆంధ్రజ్యోతి) ప్రతి వ్యక్తి అభ్యున్నతికి చదువే కీలకమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. మదనాపురం మోడల్ స్కూల్‌లో స్మార్ట్ క్లాస్ రూమ్ కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. ఎన్‌ఐటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ కింద మంజూరు చేసిన స్మార్ట్‌క్లాస్ రూము ప్రారంభించారు. కార్యక్రమం లో డీఈవో మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టరు రామారావు, ఇండస్ టవర్స్ సీఈవో దిలిప్ కుమార్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆర్. రామకృష్ణారావు, సంస్థ భాగస్వామి రామ్మోహనరావు, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ రొంగళి రమేష్ నాయుడు, మండల ప్రత్యేకాధికారి దుర్గా ప్రసాద్; తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి , ఎంపీడీవో రమణమూర్తి పాల్గొన్నారు.

30న లాకౌట్ ఎత్తివేత

కొత్తవలస, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మండంలోని తుమ్మికాపల్లి పంచాయతీ శివారులోగల సీతంపేటలో ఉన్న ఉమాజూట్ మిల్లు లాకౌట్‌ను ఈనెల 30న ఎత్తివేయనున్నట్లు కార్మికసంఘ నాయకడు గణేష్ పండా తెలిపారు.ఈమేరకు శనివారం విశాఖలోని జేసీఎల్ వద్ద కార్మిక సంఘ ప్రతినిధులతో చర్చలు జరిగాయి.గతఏడాది జూన్‌లో జూట్‌మిల్లులో యాజమాన్యం లాకౌట్ విధించిన విషయం విదితమే.ఈ నేపథ్యంలో లాకౌట్‌ను ఎత్తి వేయాలని కార్మికులు పోరాటాలు చేస్తున్నారు. యాజమాన్య ప్రతినిధులతో జరుగుతున్న చర్చల్లో ఇటీవల ఓ వ్యక్తికి మిల్లును అప్పగించడానికి అంగీకారం కుదరడంతో మిల్లులో విధించిన లాకౌట్‌ను ఎత్తి వేస్తామని ప్రకటన చేశారు.

14 మండలాల్లో వడగాల్పులు

విజయనగరం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భానుడి ప్రతాపం చూపుతున్నాడు. ఉదయం తొమ్మిదిగంటలకే ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు భయాందోళన చెందుతున్నారు. శనివారం కొత్తవలసలో 41.5, ఎస్.కోట 40.8, విజయనగరంలో 40.6, వంగరలో 40.3, జామిలో 39.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యాయి.14మండలాల్లో వడగాల్పులు వీచినట్లు అధికారులు తెలిపారు.

ఓటర్ల నమోదుపై సమీక్ష

నెల్లిమర్ల, మార్చి 15(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల నమోదు, తొలగింపు ఎన్నికల నిర్వహణ, పోలింగ్ కేంద్రాలు తదితర అంశాలపై నెలవారీ సమీక్ష జరిగింది. తహసీల్దార్ బి.సుదర్శనరావుతోపాటు ఎన్నికల విభాగం సిబ్బంది, రాజకీ పక్షాల నాయకులు భవిష్యత్తులో చేపట్టాల్సిన మార్పులు, చేర్పులు, అభ్యంతరాలుప్రశాంతఎన్నికల నిర్వహణపై చర్చించారు. సమావేశంలో రెవెన్యూ సిబ్బంది, కాంగ్రెస్‌పార్టీ ప్రతినిధులు కనకల పద్మనాభం, సుద్దాపు వెంకటరమణ పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలందించాలి

భోగాపురం, మార్చి15(ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు మెరుగైన సేవలందించాలని ఏపీరాష్ట్ర పన్నుల ప్రధాన కమీషనర్, సహకార శాఖ కమిషనర్, జిల్లా ప్రత్యేకాధికారి అహ్మద్‌బాబు సూచించారు. శనివారం పోలిపల్లి పీఏసీఎస్‌లో కార్యాలయంలో సిబ్బందినిలావాదేవీలు, ఖాతాదారులు, రుణాలు మంజూరు, తదితర పలు విషయాలు అడిగితెలుసుకొన్నారు. పీఏసీఎస్‌సేవలు తర్వరలో ఆన్‌లైన్ కానున్నాయని తెలిపారు. తొలుత బ్యాంకు సిబ్బంది, మార్కెఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు అహ్మద్‌బాబును ఆహ్వానించారు కార్యక్రమంలో కలెక్టర్ బిఆర్‌.అంబేద్కర్, ఆర్డీవో డి.కీర్తి, తహసీల్దార్ ఎం.సురేష్, కర్రోతు సత్యనారాయణ, కర్రోతురాజు, సీఈవో ఉమామహేశ్వరరావు, డీసీఏవో సన్యాసినాయుడు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రాజాం రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి)! మండలంలోని ఇప్పిలిపేట జంక్షన్ వద్ద ఈనెల శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎం.జె. వలస గ్రామానికి చెందిన కె.ఆనంద్, బి.రఘువర్మ గాయపడినట్లు ఎస్ఐ రవికిరణ్ శనివారం తెలిపారు. వారిద్దరూ చీపురుపల్లి నుంచి రాజాం వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్నారని చెప్పారు. ముందు వెళ్తున్న ఆటోను ఓవర్‌టేక్ చేసే సమయంలో రాజాం నుంచి చీపురుపల్లి వైపు వెళ్తున్న ఆటోను ఢీకొనడంతో ప్రమాదం సంభవించిందని తెలిపారు. గాయపడిన ఇద్దరూ విశాఖలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నాయిరాలవలసలో..

రేగిడి, మార్చి 15, (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయిరాలవలసలో పొలందారికి సంబందించి రెండు కుటుంబాల మధ్య చెలరేగిన వివాదం శుక్రవారం రాత్రి ఘర్షణకు దారితీసింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన తల్లి కుమారుడు బెజ్జిపురపు శ్రీదేవి, శ్రీకాంత్‌లపై కొందరు దాడిచేసి గాయపరిచారు. ఎస్ఐ నీలావతి కథనం మేరకు.. గ్రామానికి చెందిన బెజ్జిపురపు శ్రీదేవి, రుంకు గణపతి కుటుంబసభ్యుల మధ్య పొలందారి విషయంపై కొద్దిరోజులుగా వివాదం నడుస్తోంది. ఈనేపథ్యంలో రెండురోజులుగా ఈదారి విషయంపై మరోసారి వివాదం చెలరేగింది. ఈక్రమంలో మాటమాట పెరిగి శ్రీదేవి, కుటుంబసభ్యులపై రుంకు గణపతి, కుటుంబ సభ్యులు దాడిచేసి గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు గణప తి, మరి కొందరిపై కేసు నమోదుచేశారు.

సీఎంఆర్ జ్యువెలరీ షోరూము ప్రారంభం



షోరూమును ప్రారంభిస్తున్న మీనాక్షి చౌదరి



అధినేత ఎంవీఆర్, హారికతో కలిసి బంగారు ఆభరణాలను చూపిస్తున్న మీనాక్షి

రాజాం/రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాజాంలోని పాలకొండ రోడ్డులో సినీనటి మీనాక్షి చౌదరి శనివారం సీఎంఆర్ జ్యువెలరీ షోరూమును ఆ సంస్థ అధినేత మావూరి వెంకట రమణతో కలిసి ప్రారంభించారు. రెండంతస్తుల షోరూములో వెంకటరమణ కోడలు హారికతో కలిసి కలియ తిరిగారు. బంగారు ఆభరణాల వివరాలను మీనాక్షి చౌదరి అడిగి తెలుసుకున్నారు. అనంతరం షోరూము బయట ఏర్పాటుచేసిన వేదిక పైనుంచి చేయి ఊపుతూ కార్యక్రమానికి హాజరైన వారిని ఉద్దేశించి.. హలో రాజాం.. ఎలాఉన్నారు.. బాగు న్నారా.. అని మీనాక్షి పలకరించారు. వందలాది మంది ఆమెను చూసేందుకు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆమెవిలేకరులతో మాట్లాడుతూ తెలుగుమహిళల జీవితాలు బంగారు ఆభరణాలతోనే ముడిపడి ఉంటాయని తెలిపారు. రాజాంలో ప్రారంభించిన ఈ షోరూం 18వది అని వెంకటరమణ తెలిపారు. కాగా పట్టణానికి చెందిన వైద్యుడు గ్రంధి ప్రకాశరావు ప్రథమ కొనుగోలుదారుగా ఆభరణాలు కొనుగోలు చేశారు. రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ కూడా ప్రారంభోత్సవానికి హాజరయారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు చెలికాని జగన్నాథస్వామి తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

●ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



మార్లాపల్లి బాధితులకు ఆర్డర్ కాపీ అందజేస్తున్న కోళ్ల లలితకుమారి

లక్కవరపుకోట,మార్చి15(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ధ్యేయమని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. నియోజకవర్గంలో వివిధ రుగ్మతలతో బాధపడుతూ సరైన వైద్యం పొందలేకపోతున్న 19 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.12.98 లక్షలు విడుదలయ్యాయి. ఈ మేరకు ఆయా బాధితులకు లక్కవరపుకోటలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి దంపతులు కేబీపీ రాంప్రసాద్ శనివారం ఆర్డర్ కాపీలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల సంక్షేమమే టీడీపీ అజెండా అని తెలిపారు. కార్పొరేట్ వైద్యం పొందలేని పేదలకు ముఖ్యమంత్రి అండగా ఉండి సహాయనిధి నుంచి నిధులు విడుదల చేస్తూ రోగులను ఆదుకుంటున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఊసేలేదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొల్లు రమణమూర్తి, చొక్కాకుల మల్లునాయుడు, లాలం అర్జునరావు, గొంప దుర్గా ఉమేష్, జీఎస్.నాయుడు, బంగారం రమేష్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరిస్తాం

●నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

భోగాపురం, మార్చి15(ఆంధ్రజ్యోతి): అన్ని సమస్యలు పరిష్కరించనున్నట్లు నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి తెలిపారు. శనివారం మండలంలోని ముంజేరు జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే పజలనుంచి వినతుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారులు, పింఛన్లు, తదితర సమస్యలపై పలువురు దరఖాస్తులు అందజేశారు.

చంద్రబాబుతోనే సామాజిక న్యాయం

● నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతుబంగార్రాజు



మాట్లాడుతున్న కర్రోతు బంగార్రాజు

భోగాపురం, మార్చి15(ఆంధ్రజ్యోతి): సీఎం నారాచంద్రబాబు నాయుడుతోనే సామాజిక న్యాయం సాధ్యమని ఏపీ మార్కెఫెడ్ ఛైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతుబంగార్రాజు తెలిపారు. శనివారం మండలంలోని పోలిపల్లిలో చంద్రబాబునాయుడు శాసనసభలో తొలిసారి ప్రమాణం స్వీకారం చేసి 47 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. తొలిసారిగా చంద్రబాబు ఎమ్మెల్యేగా శాసనసభలో ప్రమాణ స్వీకారం చేసి నేటితో 47 ఏళ్లు పూర్తయ్యిందని తెలిపారు. సైబరాబాద్, అమరావతి, పోలవరం సృష్టికర్త, అభివృద్ధి ప్రదాత చంద్రబాబే అన్నారు. చంద్రబాబు తనకున్న విజన్‌తో తెలుగు రాష్ట్రాను అభివృద్ధి చేయడంలో ప్రధాన పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో నాయకులు అప్పలస్వామి, కందిరమణ, ఎ.శ్రీను పాల్గొన్నారు.

శరవేగంగా రోడ్ల నిర్మాణాలు

●రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్



సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న కోండ్రు మురళీమోహన్

రాజాం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రోడ్లు, కాలువల నిర్మాణాలు శరవేగంగా పూర్తవుతున్నాయని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తెలిపారు.శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో 60 వినతులు అందాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.రేగిడి మండలంలోని సంకిలికి చెందిన బట్న రవి కుటుంబసభ్యులకు ముఖ్యమంత్రి సహాయనిధికి సంబంధించి 2, లక్షల 7వేల 952 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ దార్శినికత గల ప్రజానేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడని తెలిపారు. చంద్రబాబు ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకరంచేసి 47 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుభాకాం క్షలు తెలిపారు.స్వర్ణాంధ్ర విజన్-2047తో పౌరుల తలసరి ఆదాయం రూ 35 లక్షల కు పెంచుందుకు అహర్నిశలు కృషి జరుగుతోందన్నారు. నెల్లూరు, చెన్నై జాతీయ రహదారుల నిర్మాణాలకు బీజం వేశారన్నారు. పంచాయతీలు, మునిసిపాలిటీలకు కేంద్రం ఆర్థిక సంఘం ఇచ్చిన నిధులు రూ.27 వేల కోట్లు దారి మళ్లించకుండా చంద్రబాబు ప్రభుత్వం స్థానిక సంస్థకు విడుదల చేసి నిజమైన వికేంద్రికరణకు పట్టం కట్టారన్నారు. కార్యక్రమంలోటీడీపీ పట్టణాధ్యక్షుడు నంది సూర్యప్రకాష్‌రావు, దూబ ధర్మారావు, శాసపు రమేష్‌కుమార్, దుప్పలపూడి శ్రీను, కొయ్యాన జగదీష్, కమిషనర్ జె. రామప్పలనాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పొన్నాడ ప్రసాద్, ఏఈ వెంకట రామరాజు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

●గరివిడిలో పశువైద్య కళాశాల విద్యార్థుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న పశువైద్య కళాశాల విద్యార్థులు

గరివిడి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని గరివిడిలో స్థానిక పశువైద్య కళాశాల విద్యార్థులు శనివారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కరించాలని 40 రోజులుగా వివిధ రకాలుగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ఈ మేరకు శనివారం కళాశాల ప్రాంగణం నుంచి గరివిడి సినిమాహాలు సెంటర్ వద్ద ర్యాలీ చేపట్టారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

13 మద్యం సీసాల స్వాధీనం

విజయనగరం క్రైం,మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సంతకవిటి మండ లంలోని పునుకుటివలస శివార్లలో మద్యం విక్రయిస్తున్న పరిశర్ల శ్రీనివాస్‌ను అదుపు లోకి తీసుకుని 13 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ రాజశ్రీ తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రరావు ఆదేశాలతో చర్యల నిమిత్తం రాజాం ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించినట్లు చెప్పారు. దాడు ల్లో హెచ్‌సీ రాంబాబు, ఈసీలు నాయుడు, జనార్దన్, మనోజ్ పాల్గొన్నారు.

సోంపురంలో ఎడ్ల బండ్ల పోటీలు



పోటీలో దౌవుడుతీస్తున్న ఎడ్లబండి

వేపాడ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోంపురంలో ముత్యాలమ్మతల్లి అమ్మవారి తీర్థమహోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతోంది. శనివారం గ్రామస్థులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం ఎడ్లబండ్ల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్య క్రమాలు అలరించాయి.

మారికలో వైద్య శిబిరం

వేపాడ మార్చి 15 (ఆంధ్రజ్యోతి):మండలంలోని మారికలో శనివారం వేపాడ పీహెచ్‌సీ వైద్యాధికారి కె.అజయ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు.ఈసందర్భంగా 40 గిరిజనులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వేసవిలో తీసుకోవా ల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్య క్రమంలో సర్పంచ్ పాతబోయిన పెంటమ్మ, అప్పన్న పాల్గొన్నారు.

పూల్‌బాగ్‌లో ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

విజయనగరం రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పూల్‌బాగ్‌లో ఆంజనేయ స్వామి విగ్రహ పరిసరాలను ఆక్రమించిన వారిపై నగరపాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టాలని సినీనటి కళ్యాణి కోరారు. శనివారం విజయనగరంలోని పూల్‌బాగ్‌లో హిందూ రక్షా సమితి ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈవిగ్రహానికి ఆనుకుని ఉన్న స్థలం ఆక్రమణకు గురికావడంతో కొన్నేళ్ల విగ్రహం అక్కడ లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో హిందూ రక్షా సమితి ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ అధికారులు, స్థానికులతో మాట్లాడి విగ్రహం గతంలోఉన్న ప్రాంతంలో తిరిగి శనివారం సినీనటి కల్యాణి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూఎన్నో ఏళ్ల నుంచి ఇక్కడ విగ్రహం ఉండేదని, ఓ వ్యక్తి ఇక్కడ నిబంధనలకు వ్యతిరేకంగా ఇంటిని నిర్మించడంతో స్వామి విగ్రహానికి ఇబ్బంది కలిగిందన్నారు. హిందూ రక్షా సమితి ఆధ్వర్యంలో అంజనేయస్వామి విగ్రహాన్ని యథావిధిగా ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కార్యక్రమం లో హిందూ రక్షా సమితి ప్రతినిధులు పార్థసారథి, ఆబోతుల శ్యామ్ పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

రాజాం రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి)! పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తప్పవని ఎస్ఐ రవికిరణ్ హెచ్చరించారు. రాజాం టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన రౌడీషీటర్లతో శనివారం రాత్రి సమావేశమయ్యారు.

స్టీరింగ్‌పై డ్రైవర్ వాలిపోయి.. లారీ ఢీకొని

●రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి ● ముగ్గురికి గాయాలు

బొబ్బిలి/రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి ఫ్లైఓవర్‌పై శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. సాలూరులోని ఓంశాంతి బ్రహ్మకుమారీస్ సంస్థకు చెందిన కొందరు కొద్దిరోజుల కిందట మౌంట్ అబూ పర్యటనకు వెళ్లి, తిరిగి శనివారం బొబ్బిలి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి తమ సంస్థకు చెందిన వాహనంపై సాలూరు బయలు దేరారు. ఫ్లైఓవర్‌పైకి వచ్చేసరికి సాలూరుకు చెందిన డ్రైవర్ శంబాన లక్ష్మణరావు(62) అకస్మాత్తుగా వాహనం స్టీరింగ్‌పై వాలిపోయాడు. ఆ సమయంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. దీంతో లక్ష్మణరావు(62) మృతిచెందాడు. డ్రైవర్ పక్కన కూర్చొన్న బ్రహ్మకుమారి సదాశివం శిల్ప, రాజరత్న, సుజాతకు గాయాలయ్యాయి. వెంటనే అక్కడే ఉన్న నెలిమర్లకు చెందిన ఆటో డ్రైవర్ కారుకొండ రమణబాబు స్పందించి తోటివారి సహాయంతో క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బేబీనాయన ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం కోసం 108లో విశాఖపట్నం తరలించారు. ఎస్ఐ జ్ఞానప్రసాద్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బుడుమూరు వద్ద ఘోర ప్రమాదం

●టూ వీలర్‌ను కారు ఢీకొనడంతో జిల్లా వాసి శంకరరావు మృతి

●ఇదే ఘటనలో శ్రీకాకుళం జిల్లా వాసులు ముగ్గురి మృతి



శంకరరావు (ఫైల్)

లావేరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం బుడుమూరు వద్ద జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. వీరిలో విజయనగరం జిల్లా సంతకవిటి మండలం మద్దూరి శంకరంపేటకు చెందిన తోలాపు శంకరరావు(34) ఉన్నాడు. పోలీసుల కథనం మేరకు.. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం మండలంపెదలోగిడి గ్రామానికి చెందిన దువ్వారి కాళిదాసుది వ్యవసాయ కుటుంబం. ఆయనకు ఇద్దరు కుమారులు. పెద్దకొడుకు సంతు విశాఖపట్నం జిల్లా మధురవాడలో ఉంటున్నాడు. పెద్దకుమారుడి ఇంట్లో మనువడి పుట్టినరోజు వేడుక కోసం శనివారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో కాళిదాసు కుటుంబ సభ్యులు కారులో బయలుదేరారు. సరిగ్గా శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం బుడుమూరు వద్దకు వచ్చేసరికి కారు టైరు పంక్చర్ అయి పేలింది. దీంతో కారు అదుపు తప్పి ముందుగా స్కూటీపై వెళ్తున్న టి.శంకరరావును ఢీకొట్టింది. ఆ తర్వాత కారు పల్టీలు కొడుతూ హైవేపై పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ ఘటనలో కారు, స్కూటీ నుజ్జునుజ్జయ్యాయి. శంకరరావు అక్కడికక్కడే మృతిచెందాడు. కారులో ఉన్న మీనమ్మ, ఆమె కుమారుడు లక్ష్మీపతి తీవ్రగాయాలతో ఘటనా స్థలంలోనే మరణించారు. కారు డ్రైవింగ్ చేసిన భాస్కరరావు కొనఊపిరితో ఉండగా 108 వాహనంలో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు కోల్పోయాడు. ● సంతకవిటి మండలం మద్దూరి శంకరంపేటకు చెందిన టి.శంకరరావు రణస్థలం మండలంలో బీరు కంపెనీలో పనిచేస్తున్నాడు. బంటుపల్లి గ్రామంలో అద్దె ఇంటిలో నివసిస్తున్నట్లు ప్రాథమిక సమాచారం. శంకరరావు తన స్కూటీపై ఎప్పటిలానే వెళ్తుండగా.. వెనుకనుంచి వచ్చిన కారు ఢీకొని మృత్యుఒడికి చేరారు.

విచారణ పేరుతో పిలిచి కొట్టారు

● బాధితుడి బంధువుల ఆరోపణ.. అదేమీ లేదంటున్న పోలీసులు



వీపుపై దెబ్బలు చూపిస్తున్న రాంబాబు

మెరకముడిదాం మార్చి 15 (ఆంధ్రజ్యోతి) మండలంలోని బుదరాయవలస పోలీస్ స్టేషన్‌లో ఓ కేసు విచారణలో భాగంగా అదే గ్రామానికి చెందిన ఎస్.రాంబాబుకు విచారణ పేరుతో పిలిచి పోలీసులు లాఠీలతో విచక్షణారహితంగా కొట్టారని బాధితుడి బంధువులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో ఓ కేసు విచారణలో భాగంగా రాంబాబునుస్టేషన్‌కు శనివారం మధ్యాహ్నం పిలిపించారని తెలిపారు. స్టేషన్‌లో పెట్టి కొట్టి గాయపరిచారని పేర్కొన్నారు. అనంతరం వార్నింగ్ ఇచ్చి విడిచిపెట్టడంతో రాంబాబు కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. దీంతో చీపురుపల్లి ఆసుపత్రిలో చేర్పించేం దుకు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.వీపుపై తీవ్రంగా వాతలు వచ్చే లా కొట్టారని ఆందోళన వ్యక్తంచేశారు. కాగా రాంబాబుకు సంబంధించి పోలీసులపై కుటుంబ సభ్యులు చేసిన ఆరోపణలపై ఎస్ఐ జె.లోకేష్ వివరణ కోరగా పలుమార్లు రాంబాబుపై ఫిర్యాదు రావడంతో శనివారం దర్యాప్తు నిమిత్తం స్టేషన్‌కు పిలిపించామని తెలిపారు. ఆదివారం మళ్లీ రావాలని సూచించినట్లు చెప్పారు. బయట రాంబాబుకు తగాదాలు ఉన్నాయని, ఒంటిపై ఉన్న దెబ్బలకు సంబంధించి పోలీసులపై చేసిన ఆరోపణలపై వాస్తవం లేదని చెప్పారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

విజయనగరం క్రైం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసు స్టేషన్లలో రౌడీషీటర్లు, సస్పెక్టడ్ షీటర్ల శనివారం ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పాత నేరస్థులు, షీట్స్ కలిగిన వ్యక్తులు సన్మార్గంలో నడవకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మంచి ప్రవర్తన కోసం బైండోవర్ చేయాలని ఆదేశించారు. బ్యాడ్ క్యారెక్టరు షీట్స్ కలిగిన వ్యక్తులను వారు నివాసముంటున్న పరిధిలో పోలీసు స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించాలని తెలిపారు. బీసీ షీట్లు గల వ్యక్తులకు లేటెస్ట్ ఫోటోలు తీసి హిస్టరీ షీట్లలో పొందుపరచాలని పేర్కొన్నారు.

పథకాలు అందేలా కృషి

నెల్లిమర్ల, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా బీజేపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌వర్మ కోరారు. శనివారం బీజేపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడు తూ పార్టీ బలోపేతానికి కృషి చేసినప్రతీ ఒక్కరికి గుర్తింపు,ఆదరణ ఉంటాయని తెలిపారు. కార్య క్రమంలోనాయకులుమైపాడ ప్రసాద్‌పాల్గొన్నారు.

రసాభాసగా సర్వసభ్య సమావేశం

బాడంగి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ భోగి గౌరి అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా సాగింది. సమావేశంలో సీఎస్‌డీటీ స్వర్ణలత నిత్యావసర సరుకుల పంపిణీపై వివరిస్తుండగా.. మల్లంపేట సర్పంచ్ వంగపండు పద్మావతి లేచి, మాట్లాడారు. తమ గ్రామంలో డీలరుగా చేస్తున్న మహిళ విశాఖపట్టణంలో ఉన్నప్పటికీ ఆమె తండ్రి బయోమెట్రిక్ ద్వారా సరుకులను ఇస్తున్నారని, దీనిపై గత ప్రభుత్వ హయాంలో మొర పెట్టుకున్నప్పటికీ ప్రయోజనం లేకపోయిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత 3 సమావేశాల్లో చెప్పినప్పటికీ చర్యలు శూన్యమన్నారు. గజరాయనివలస ఎంపీటీసీ పాలవలస గౌరు మాట్లాడారు. ఐదేళ్ల కిందట పాలవలస భవానీ పేరున ఇల్లు మంజూరయ్యిందని, ఇల్లు కట్టుకుందామంటే బిల్లు అయిపోయిందని చెప్పడం విడ్డూరంగా ఉందని ఆయన హౌసింగ్ ఏఈని నిలదీశారు. అలాగే రాష్ట్ర కొప్పలవెలమ డైరెక్టర్ కొల్లి అప్పలనాయుడు మండల పశు వైద్యాధికారి తీరుపై విరుచుకుపడ్డారు. తమ గ్రామానికి ఒక్క గోకులం కూడా మంజూరు చేయకపోవడమేంటని ప్రశ్నించారు. వీటిపై స్పందించిన ఎంపీడీవో రామకృష్ణ వచ్చే సమావేశంలోగా అన్ని సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో అధికారులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సజావుగా బొబ్బిలి మండల సమావేశం

బొబ్బిలి రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సజావుగా సాగింది. ఎంపీడీవో పి.రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎంపీపీ శంబంగి లక్ష్మి, జడ్పీటీసీ సంకిలి శాంతకుమారి పాల్గొన్నారు. ముందుగా వివిధ శాఖల వారిగా అధికారులు చర్చించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈవోపీఆర్డీ భాస్కరరావు, పరిపాలన అధికారి అప్పారావు, ఏడీఏ మజ్జి శ్యామ్‌సుందర్, వైద్యాధికారి రఘువంశి తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి

బొబ్బిలి/రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్క మహిళా తమ సెల్‌ఫోన్‌లో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సీఐ కె.సతీష్‌కుమార్ సూచించారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. మహిళలు, చిన్నారుల భద్రత కోసం, రక్షణ కోసం పోలీసు శాఖ శక్తి యాప్‌ని అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ఈ యాప్‌లో ఎస్‌ఓఎస్ బటన్ నొక్కితే చాలు నిమిషాల్లో పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి రక్షిస్తారని తెలిపారు.

అలజంగిలో ప్రజా చైతన్య యాత్ర

బొబ్బిలి రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అలజంగి గ్రామంలో శనివారం సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పి.శంకరరావు పాల్గొని మాట్లాడారు. రెవెన్యూలో అవినీతిని నివారించాలని కోరుతూ ఈ నెల 17వ తేదీన తహసీల్దార్ కార్యయం వద్ద ధర్నా చేస్తామన్నారు.

లక్ష్యాలను పూర్తిచేయాలి

రామభద్రపురం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధిహామీ పథకం లక్ష్యాలు పూర్తి చేసేందుకు సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఉపాధి ఏపీడీ రమామణి కోరారు. శనివారం స్థానిక ఉపాధి కార్యాలయంలో ఆమె టెక్నికల్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది ఎన్ని పనులు జరిగాయి, ఇప్పటివరకు ఎన్ని పనులు పూర్తిచేశారని అధికారులను ప్రశ్నించారు. కొత్త పనులను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. పెంట గుమ్మలు, షోక్‌పిట్ల నిర్మాణాలపై దృష్టి సారించాలని, గోకులాల నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి ఏపీవో గొలగాని త్రినాథరావు, టీఏ ఈదుబిల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

రామభద్రపురం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్యాస్ గోదాం వద్ద శనివారం సాయంత్రం 50 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ వెలమల ప్రసాద్ తెలిపారు. బాడంగి మండలం పిన్నవలస గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఈ సీసాలను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని, స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు. ఏఎస్ఐ అప్పారావు, హెచ్‌సీ నారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి గ్రామ సభ

బొబ్బిలి రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తోందని తహసీల్దార్ ఎం.శ్రీను అన్నారు. జగన్నాథపురం గ్రామంలో శనివారం నిర్వహించిన రీసర్వే గ్రామ సభలో ఆయన పాల్గొని, మాట్లాడారు. గ్రామ సభలను రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'సూర్యఘర్'ను వినియోగించుకోండి

చీపురుపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈపీడీసీఎల్ చీపురుపల్లి డీఈ బీవీ రమణ కోరారు. శనివారం పట్టణంలోని కొత్తగవిడి వీధి అవగాహన కార్యక్రమంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి ఏఈ సూర్య ప్రకాభకర్, సిబ్బంది పాల్గొన్నారు.

కాన్షీరామ్ ఆశయ సాధనకు కృషి

విజయనగరం దాసన్నపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సోము రాంబాబు కోరారు. శనివారం విజయనగరంలోని కంటోన్మెంట్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో కాన్షీరామ్ జయంతి పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సోములు, శివప్రసాద్, గౌరీ, పైడిరాజు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

● కేంద్రాలను పరిశీలించిన విద్యా శాఖాధికారులు

రామభద్రపురం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఈనెల 17వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ఎంఈవో ఆమిటి తిరుమలప్రసాద్ తెలిపారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండలంలో 510 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, వీరికి 2 కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ● తెర్లాం: పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేశామని ఎంఈవో జె.త్రినాథరావు తెలిపారు. ఆయన శనివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. మండలంలో మూడు పరీక్ష కేంద్రాలను ఎంపిక చేశామని చెప్పారు. మొత్తం 542 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని ఆయన తెలిపారు. ● గజపతినగరం: గజపతినగరంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో వసతులను శనివారం ఎంఈవో ఎస్. విమలమ్మ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోమవారం నుంచి జరిగే ఈ పరీక్షలకు స్థానిక ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో 155, ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో 187, ఎస్‌కే విద్యాపీఠ్‌లో 144, మరుపల్లి ఏపీ మోడల్ పాఠశాలలో 172 మంది పరీక్షలు రాయనున్నారు.

● వంగర: వంగర, మడ్డువలస, సీతారాంపురంలో సోమవారం నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఏఈవో జగదీశ్వరీ తెలిపారు. శని వారం మడ్డువలస గురుకులంలో పదో తరగతి పరీక్ష కేంద్రం పరిశీలిం చారు. మూడు కేంద్రాల్లో 557 మంది పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలి పారు. ఆమె వెంట సిబ్బంది పద్మజ, రమణమ్మ ఉన్నారు. ● మెరకము డిదాం: మెరకముడిదాం, గర్భాం పాఠశాలల్లో పదో తరగతి ఎరీక్షలు నిర్వహణకు ఏర్పాట్లుచేసినట్లు ఎంఈవోలు ఎం. చంద్రశేఖర్, టి.ధర్మశ్రీ తెలిపారు. సోమవారం నుంచి జరిగే పరీక్షలకు 633 మంది విద్యార్థులు హాజరుకానున్నారని చెప్పారు. ● జామి: కుమారాం కేజీబీవీ పదో తరగతి విద్యార్థినులకు కేజీఏ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పరీక్షల సామగ్రిను అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ఎన్‌జీవో బూర్జబారికి జోసెప్ ప్రసాదరావు విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ● శృంగవరపుకోట రూరల్: మండలంలోని తిమిడి ప్రభుత్వం జడ్పీ ఉన్నతపాఠశాలలో పదో తరగతి విదార్థుల కోసం విజయిభవ కార్యక్రమం గ్రామ యువజనసంఘ సభ్యులు శనివారం నిర్వహించారు. యువజనసంఘ నాయకుడు ఒబ్బిన సతీష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

● ఘనంగా స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర

ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా తీర్చి దిద్దాలి

ఆంధ్రప్రదేశ్‌ను ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని అధికారులు, ప్రజాప్రతినిదులు పిలుపునిచ్చారు. స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పరిశుభ్ర కార్యక్రమాలు చేపట్టారు. పలు కార్యాలయాల వద్ద మొక్క లు నాటారు. రహదారులను శుభ్రం చేశారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్‌ను నిషేధించాలని కోరుతూ ర్యాలీలు నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



నెల్లిమర్లలో రోడ్డును శుభ్రం చేస్తున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు



విజయనగరం బాబామెట్ట: నగర పంచాయతీ కమిషనర్ నల్లనయ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఈపీఎఫ్ పెన్షన్ రూ.9వేలకు పెంచాలి

బొబ్బిలి/రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఈపీఎఫ్ కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని కోరుతూ ఈనెల 18న ఈపీఎఫ్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.శంకరరావు తెలిపారు. ఈసందర్భంగా శనివారం బొబ్బిలిలో స్థానిక సీఐటీయూ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. కార్మికులు, ఉద్యోగుల నుంచి వచ్చిన ఈపీఎఫ్ సొమ్ము రూ.59వేల కోట్లు ఉంటే ఆ డబ్బులకు సంవత్సరానికి వడ్డీ రూ.22వేల కోట్లుకు పైగా వస్తుందన్నారు. అందులో రూ.15,140 కోట్లు పెన్షన్లు ఇస్తున్నారని ఇంకా రూ.7వేల కోట్లు మిగులుతుందని తెలిపారు. అనంతరం కరపత్రం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు వి.శేషగిరిరావు, నాయకులు పి.కృష్ణ, ఎస్.గోపాలం, ఆర్.త్రినాథ తదతరులు పాల్గొన్నారు.

కొండపైకి టీకా చేరేనా?

(ఐదో పేజీ తరువాయి)

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి గ్రామాలకు ఆరోగ్య కార్యకర్తలు (ఏఎన్ఎం) తీసుకెళ్తుంటారు. తల్లుల సమక్షంలో జీరో వయసు నుంచి 16 సంవత్సరాల వరకు వివిధ రకాల టీకాలను క్రమం తప్పకుండా అందిస్తారు. ఆ సమయంలో ఎంసీసీ (మాతా శిశు సంరక్షణ) కార్డులో నమోదు చేస్తారు. టీకా వేసిన తేదీ, తిరిగి ఏ టీకా ఎప్పుడు వేయాలో కూడా ఈ కార్డులో రాస్తారు. టీకాల కార్యక్రమం ముగిసిన తరువాత పిల్లలకు వేసిన టీకాల పేర్లు, ఎంత మందికి వేశారు? ఎంత మంది మిగిలారు? వీరికి తిరిగి ఎప్పుడు వేయాలన్న నివేదికను ఏఎన్ఎంలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆన్‌లైన్ చేయించాలి. ఇంత ప్రక్రియ ఉండే వాక్సినేషన్ గిరిశిఖర గ్రామాల్లో సరిగా జరగకపోవడం.. సంవత్సరాలుగా ఉన్నతాధికారులు గుర్తించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. మాతా శిశు సంరక్షణ (ఎంసీసీ) కార్డులను గిరిజనుల నుంచి సేకరించి అప్పటికప్పుడు నింపేసే పరిస్థితి ఉండడం దారుణం. తప్పును కప్పిపుచ్చుకొనే బదులు గిరిజన చిన్నారుల ఆరోగ్యం కోసం పనిచేసి ఉంటే మంచిదని గిరిజన సంఘాలు భావిస్తున్నాయి.

మిగిలిన టీకాల మాటేంటి?

గిరిజన పిల్లలకు వచ్చిన జ్వరం, దద్దుర్లను బట్టి మిజల్స్ రుబెల్లా (ఎంఆర్) వ్యాక్సిన్‌ను ఇస్తున్నారు. అయితే వివిధ రకాల టీకాలను పుట్టుక నుంచి 16 సంవత్సరాల వరకు ఇవ్వాల్సి ఉంటుంది. పుట్టుక నుంచి రెండు వారాల వరకు బీసీజీ, ఓపీవీ, హెపటైటిస్-బి (క్షయ, పోలియో, పచ్చకామెర్లు రాకుండా), పది వారాలకు పెంటావాలెంట్ (ధనుర్వాతం, కంఠసర్పి, గోరింత దగ్గు, పచ్చకామెర్లు, న్యూమెనియా రాకుండా), 14వారాలకు పెంటావాలెంట్, 16వారాలకు ఆర్‌వీవీ, 10వ నెలలో మిజల్స్ రుబెల్లా (తట్టు రాకుండా) ఆపై పీసీవి బూస్టర్, ఐపీవీ డోస్ (పోలియో రాకుండా) ఇవ్వాలి. 16 నెలలకు డీపీటీ (ధనుర్వాతం, కంఠ సర్పి, గోరింత దగ్గు రాకుండ) ఓపీవీ బూస్టర్ (పోలియో), మిజిల్స్ రూబెల్లా (తట్టు రాకుండా) ఇవ్వాలి. 5 సంవత్సరాలకు డీపీటీ బూస్టర్ (ధనుర్వాతం, కంఠసర్పి, గోరింత దగ్గు) ఓపీవీ (పోలియో రాకుండా) ఇస్తారు. ఆ తర్వాత 10 సంవత్సరాలకు ఒకసారి, తిరిగి 16 సంవత్సరాలకు టీడీ (ధనుర్వాతం రాకుండా) టీకాలను వైద్యుల సూచన మేరకు క్రమం తప్పకుండా వైద్య ఆరోగ్య శాఖ వేస్తుంది. కాగా దారపర్తి గిరిశిఖర పంచాయతీ శివారు కురిడి, పోర్లు, పల్లపుదుంగాడ, రాయపాలెం, శనగపాడు తదితర గిరిజన గ్రామాల్లో అనారోగ్యం బారిన పడుతున్న చిన్నారులకు మిజిల్స్ రుబెల్లా టీకా ఇవ్వకపోవడంతో తట్టుబయపడింది. దీనికి టీకా (వ్యాక్సిన్)ను ఇప్పుడు వైద్య ఆరోగ్య శాఖ ఇస్తోంది. ఈ టీకా ఒక్కటే ఇస్తుండడంతో మిగిలిన టీకాల మాటేంటని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు.

పీ-4 సర్వేపై అపోహలొద్దు

(ఐదో పేజీ తరువాయి)

తగు ప్రణాళికలతో ముందుకు రావాలని సూచించారు. కలెక్టర్ అంబేడ్కర్ మాట్లాడుతూ తాటిపూడి వద్ద కాటేజీల నిర్వహణ బాధ్యతను ప్రైవేటు వారికి ఇస్తే బాగుంటుందన్నారు. చింతపల్లి బీచ్ వద్ద ఉన్న 3 కాటేజీల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపించామన్నారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి మాట్లాడుతూ మామిడి ఉత్పత్తిని పెంచడానికి రైతులకు శిక్షణ ఇవ్వాలన్నారు. ● వచ్చే ఐదేళ్లలో ప్రతి శాఖ వాస్తవ ఆచరణాత్మకమైన ప్రణాళికలను రూపొందించాలని జిల్లా ప్రత్యేకాధికారి అహ్మద్‌బాబు ఆదేశించారు. అనంతరం ప్రదీప్‌నగర్‌లో ఉన్న 41వ వార్డు సచివాలయాన్ని తనిఖీ చేశారు. సమావేశంలో డీఆర్‌వో శ్రీనివాస్‌మూర్తి, ఆర్‌డీవో కీర్తి తదితరులు ఉన్నారు.

నీటి గుంతల మంజూరు

బొబ్బిలి రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామానికీ 25 నీటి గుంతలు మంజూరయ్యాయని డివిజన్ ఏపీడీ రమామణి తెలిపారు. శనివారం ఆమె స్థానిక ఏపీడీ కార్యాలయానికి విచ్చేశారు. ఈసందర్భంగా ఆమె సాంకేతిక సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జల సర్వేక్షణలో భాగంగా ప్రతి గ్రామంలో 25 నీటి గుంతలు తప్పనిసరిగా తవ్వాలన్నారు. అందుకు క్షేత్ర, సాంకేతిక సహాయకులకు లక్ష్యాలు ఇచ్చామన్నారు. వచ్చే ఏప్రెల్ నాటికి 10 గుంతలు, జూన్ నాటికి మిగిలిన 15 గుంటలు పూర్తి చేయాలన్నారు. ఏపీవో లక్ష్మీపతిరాజు, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు

(ఐదో పేజీ తరువాయి)

కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ఫ్యాన్లు, లైట్లు వంటి సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం నిధులు కేటాయించిందని తెలిపారు. ఈ జిల్లాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపామన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న పిల్లల రక్తహీనత నివారణకు విటమిన్-ఏ మాత్రలు కూడా అందిస్తున్నామని, వీటితోపాటు పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు. తొలుత పాల సరఫరా కేంద్రంలో ఉన్న స్టాకు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆమె వెంట గోదాం ఇన్‌చార్జి బండారు నాగరాజు ఉన్నారు.

మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



రామభద్రపురం: సచివాలయంలో పల్లె నిద్ర చేస్తున్న సీఐ నారాయణరావు

రామభద్రపురం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు కోరారు. పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి ఆరికతోట సచివాలయంలో ఆయన నిద్రించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ ఇటీవల సైబర్ నేరాలు ఎక్కువవుతున్నాయని, ప్రజలు వాటిపై అవగాహన కలిగిఉండాలన్నారు. మహిళలు శక్తి యాప్‌ను వినియోగిం చుకోవాలన్నారు. మత్తు పదార్థాలు, గంజాయి విక్రయించినా, వినియోగించినా కఠిన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీ మూర్తి పాల్గొన్నారు. ● వంగర: సీతారాంపురంలో సీఐ ఉపేంద్ర పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. రాత్రి గ్రామ సచివాలయంలో నిద్రించారు.

విరామం.. ఊరటే

(ఐదో పేజీ తరువాయి)

పరీక్షలకు హాజరవుతున్నారు. వీరిలో చాలా మంది గ్రామీణ ప్రాంతాల నుంచి పరీక్ష కేంద్రాలకు వెళ్లాల్సి ఉంటుంది. కొంతమంది ఆర్టీసీని ఆశ్రయిస్తే మరికొంతమంది ప్రయివేటు వాహనాలపై ఆధారపడుతున్నారు. ఈసారి హాల్‌టికెట్ చూపిస్తే ఎవరైనా ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. పరీక్షకేంద్రం ఉన్న ప్రాంతం వరకూ చార్జీ లేకుండా వెళ్లవచ్చు.

విరామం కలిసొచ్చే అంశమే

పది పరీక్షల నిర్వహణలో పరీక్షకు పరీక్షకు మధ్య ఒకరోజు సెలవు రావడం విద్యార్థులకు ఎంతో కలిసొచ్చే అంశంగా చెప్పవచ్చు. దూరప్రాంత విద్యార్థులు పరీక్ష కేంద్రం నుంచి ఇంటికి చేరుకోవడం, మరుసటిరోజు పరీక్షకు ప్రిపేర్ అవడం గతంలో ఇబ్బందిగా ఉండేది. ప్రస్తుత విధానం వల్ల విద్యార్థులలో ఒత్తిడి తగ్గుతుంది. మరుసటిరోజు పరీక్ష లేకపోవడంతో భయపడకుండా ప్రిపేర్ అయ్యే అవకాశాలున్నాయి. ఉత్తీర్ణత శాతం పెరిగే అవకాశాలు లేకపోలేదు.

- మాణిక్యం నాయుడు, జిల్లా విద్యాశాఖాధికారి

ఉచిత ప్రయాణం

ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా హాల్‌టికెట్ చూపించి విద్యార్థులు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. ఈ మేరకు సిబ్బందికి ఆదేశాలిచ్చాం. ఉదయం 10 గంటల వరకూ మధ్యాహ్నం ఒంటి గంట తరువాత విద్యార్థులు ఇబ్బందులు పడకుండా వారికి బస్సుల్ని అందుబాటులో ఉంచేలా చర్యలు చేపడుతున్నాం.

- జె.శ్రీనివాసరావు, ఆర్టీసీ డీఎం, విజయనగరం

చాన్స్ ఎవరికో?

(ఐదో పేజీ తరువాయి)

గ్రీష్మకు తాజాగా ఎమ్మెల్సీ అవకాశం ఇచ్చారు. శాసనమండలిలో ప్రభుత్వ వాయిస్‌ను గట్టిగా వినిపించాలన్న కోణంతో పాటు సామాజిక సమీకరణాలను చూసి ఆమెకు అవకాశం ఇచ్చారు.

నెలాఖరులో పదవులే పదవులు..

నెలాఖరులో జిల్లా వ్యాప్తంగా ఉన్న వ్యవసాయ ప్రాథమిక పరపతి సంఘాలకు చైర్మన్లతో పాటు డైరెక్టర్లను నియమించనున్నారు. ఇక జిల్లాలో 11 వరకూ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు డైరెక్టర్ పదవులు భర్తీ చేయనున్నారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్లు, డైరెక్టర్లు, ఆస్పత్రుల కమిటీలు.. ఇలా అన్నీ కలిపి వందల్లోనే పదవులు భర్తీచేసే అవకాశముంది.